క్లుప్తంగా

మహాప్రస్థాన సేవాసమితి అధ్యక్షుడిగా డాకా సాంబిరెడ్డి

తెనాలి: మహాప్రస్థాన సేవాసమితి, తెనాలి సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం బుర్రిపాలెంరోడ్డులోని కై లాస మహాప్రస్థానంలో నిర్వహించారు. సమావేశంలో 2025–28 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బండి సాంబశివరావు, అధ్యక్షునిగా డాకా సాంబిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జెట్టి శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారిగా తుమ్మల బాపయ్య చౌదరి ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గంలో చదలవాడ శంకరప్రసాద్, మొవ్వా సత్యనారాయణ, ఆర్ఎస్ శంకరరావు, యలవర్తి గంగాధరరావు, నర్రావుల ఆదినారాయణ, ముద్దాభక్తుని రమణయ్య, రామాయనం వేణు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, పొట్లూరి శివసుబ్రహ్మణ్యం కాశరనేని శ్రీగిరీష్, కొరటాల ఈశ్వరచంద్, సోమరౌతు సత్యనారాయణను ఎన్నుకున్నట్టు ఒక ప్రకటనలో తెలియజేశారు.

వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ నాజరుపేటకు చెందిన మోరం రవి తన భార్య శ్రీవాణిని ఈ నెల 4వ తేదీన షాపింగ్ కోసం గాంధీచౌక్‌కు తీసుకువెళ్లాడు. కొద్దిసేపటికి కొడుకును తీసుకొచ్చేందుకు ఇంటికి వెళ్లి రాగా భార్య కనబడలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు మంగళవారం నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

30వ తేదీలోపు పన్నులు చెల్లించాలి

రేపల్లె రూరల్: ముందస్తు పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘంలోని ప్రజలు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలముల పన్నులు ఏకమొత్తంలో ఏప్రిల్ 30వ తేదీలోపు ముందస్తుగా చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని కోరారు. సెలవు దినములలోనూ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటరు ద్వారా పన్నులు చెల్లించవచ్చన్నారు.

చలివేంద్రం ప్రారంభం



అమర్తలూరు(వేమూరు): వేసవి కాలంలో ప్రజలకు దాహం తీర్చేందుకు గ్రామ పంచాయతీల ద్వారా చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీడీవతో మారుతి శేషాంబా అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం చలి వేంద్రం ప్రారంభించడం జరిగిందని ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

రాజధాని పారిశుద్ధ్య కార్మికుల నిరసన



తాడేపల్లి రూరల్: రాజధానిలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ పెనుమాక, ఉండవల్లి పంచాయితీ, ఉండవల్లి సెంటర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.వేణు, సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, సీఆర్డీఏ అధికారులు, ఏజెన్సీ నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణం పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ నుంచి తొలగిస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. గురవయ్య, రాయప్ప, సుందరరావు, సుబ్బమ్మ, మేరి, కోటేశ్వరమ్మ, పౌలు, స్వరూప, రాఘవేంద్ర, కృష్ణ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

10 నుంచి జన సేవాదళ్ శిక్షణ

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలో సీపీఐ అనుబంధ సంఘం జనసేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాన్ని ఈ నెల 10న సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ప్రారంభిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం చినకాకాని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ జనసేవాదళ్ సభ్యులు అకాల వరదలు, అగ్నిప్రమాదాలతో పాటు జాతీయ విపత్తులు సంభవించినప్పుడు సేవలు అందిస్తుందన్నారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు శిక్షణ శిబిరం జరుగుతుందన్నారు. జాతీయ విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో జన సేవాదళ్ సేవలు అందిస్తారన్నారు.

‘క్రిటికల్’ నుంచి బయటపడ్డ నిర్మాణాలు!

మళ్లీ ఊపందుకుంటున్న పనులు
- శ్లాబ్‌కు సిద్ధమైన బ్లాక్
- ఇటీవల ఏడాది గడువు పెంచిన ఉన్నతాధికారులు
- 2027 ఏప్రిల్‌లో నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు



లెంటల్ లెవల్‌లో ఉన్న ఒక బ్లాక్



బేస్‌మెంట్‌లో నింపిన ఇసుక

తెనాలిఅర్బన్: పట్టణంలోని జిల్లా వైద్యశాలలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవటం... దానిలో నింపేందుకు అవసరమైన గ్రావెల్‌ను అధికారులు సరఫరా చేయకపోవటంతో ఆరు నెలల పాటు దీని పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం చెల్లించటంతో గ్రావెల్ స్థానంలో ఇసుకతో నింపి పనులు ప్రారంభించారు.

తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో 100 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావించి అందుకు అవసరమైన అనుమతులు ఇచ్చింది. అలాగే దాని నిర్మాణం కోసం రూ.45 కోట్ల నిధులు వెచ్చించింది. స్థల కేటాయింపు.. పాత భవనాలు కూల్చివేత వంటి పనులు పూర్తి చేసుకుని 2023 డిసెంబర్‌లో హైదరాబాద్ కు చెందిన ఎలిక్సర్ మిట్ ఫాం ప్రవేట్ లిమిటెడ్ సంస్థ పనులు ప్రారంభించింది. ప్రస్తుతం ఒక బ్లాక్‌లో శ్లాబ్ వేసేందుకు అవసరమైన సెంట్రింగ్‌ను ఏర్పాటు చేయగా మరో బ్లాక్ బేస్‌మెంట్ పూర్తి చేసుకుని పిల్లర్స్ పోస్తున్నారు.

నిధుల కేటాయింపు ఇలా...

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.45 కోట్లలో రూ.22 కోట్లు భవన నిర్మాణ పనులకు కేటాయించారు. మిగిలిన నిధులు ఆపరేషన్ థియేటర్‌లో, క్యాజువాలిటీలలో వస్తువుల కొనుగోలు, వార్డులలో మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా నాలుగు ఫ్లోర్‌లతో దీనిని నిర్మించనున్నారు.

యూనిట్‌లో ఉండే విభాగాలు ఇవి..

క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) విభాగాన్ని 20 పడకలతో (చిన్నపిల్లలకు అవసరమైన నాలుగు బెడ్‌లు కలిపి) ఏర్పాటు చేయనున్నారు. అలాగే హైడిఫినిషిన్ యూనిట్ (హెచ్‌డీయూ)-20 పడకలు, ఐసోలేషన్ వార్డు-30 పడకలతో, ఐసోలేషన్ గదులు-12, డయాలసిస్ బెడ్‌లు-4, ఎంసీహెచ్ (బాలింతలకు)-4 బెడ్‌లు, అత్యవసర విభాగం-10 పడకలతో నిర్మించనున్నారు. ఇవి కాకుండా మూడవ అంతస్తులో రెండు ఆపరేషన్ థియేటర్‌లను ఏర్పాటు చేయనున్నారు.

దొరకని ఎర్రమట్టి.. ఇసుకే దిక్కు.

బేస్‌మట్టం మధ్యలో ఎర్రమట్టిని పోయాలని నిబంధన ఉంది. దీనిని సరఫరా చేయాలని కాంట్రాక్టర్ అధికారులను పలుమార్లు కోరారు. కానీ అధికారులు క్వారీలు నిలిచిపోయాయని, అవి తెరచుకోగాని పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. నెలలు దాటిన మట్టిని సరఫరా చేయలేకపోయారు. దీంతో కాంట్రాక్టర్ ఉన్నతాధికారుల అనుమతితో ఇసుకతో దానిని నింపి నిర్మాణ పనులు ప్రారంభించారు.

గడువు పొడిగింపు

క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని ఈ నెల చివర్లోపు నిర్మించి అప్పగించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం దీని నిర్మాణం కోసం నిదులు విడుదల చేసిన వాటిని రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బిల్లుల చెల్లింపులు చేయలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేసి గడువును పొడిగించాలని కోరారు. దీంతో ఉన్నతాధికారులు 2027 ఏప్రిల్ వరకు పొడిగించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేశారు. అయితే అప్పుడప్పుడు ఇసుక కొరత కన్పిస్తోందని, దానిని సకాలంలో అధికారులు సమకూర్చితే మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వచ్చే ఏడాదికి పూర్తవుతాయి



తెనాలి జిల్లా వైద్యశాలలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులు వివిధ కారణాల వల్ల కొంత జాప్యం జరిగింది. ఇటీవల పనులు వేగవంతం చేయించాం. అలాగే ఉన్నతాధికారులు వారి గడువును కూడా ఇటీవల పెంచారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

–హనుమంత్ నాయక్, డీఈ, ఏపీఎంఎస్ఐడీసీ, గుంటూరు.

కార్మికులకు చెత్తను వేర్వేరుగా అందజేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను వేరువేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 17వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆ ప్రాంతవాసులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో మూడు బుట్టల విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సేకరించిన చెత్తను జిందాల్ సంస్థకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కంద్రిక మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9గంటలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు నరసింహరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన హెల్ప్ హాస్పిటల్ వైద్యులు శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. ఉచితంగా గుండె సంబంధిత పలు రకాల పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు దీనిని వినియోగించుకోవాలని చెప్పారు.

పన్ను రాయితీపై అవగాహన కల్పించండి

కమిషనర్ బండి శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఇంటి పన్ను చెల్లింపులో ప్రభుత్వం ఇచ్చిన ఐదు శాతం రాయితీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో మంగళవారం సాయంత్రం సచివాలయ అడ్మిన్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోపు ఇంటి, ఖాళీ స్థల పన్నులు ఒకేసారి చెల్లిస్తే వారికి ఐదు శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. పట్టణంలోని గృహ, స్థల యాజమానులందరూ దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు ఇంటింటికి వెళ్లి రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ మంది పన్నులు చెల్లించే విధంగా చూడాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పన్నుల వసూల్లో తెనాలి ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. సమిష్టి కృషి వల్లే జరిగిందన్నారు. రెవెన్యూ అధికారి రాంప్రసాద్ మాట్లాడుతూ పన్ను చెల్లించదలచిన వారు ఆన్‌లైన్‌లో కానీ, వార్డు సచివాలయాల్లో కానీ, మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. వెంటనే పన్నులు చెల్లించి తెనాలి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో పలువురు రెవెన్యూ అధికారులు, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తెనాలిటౌన్: రక్తదానం ఆపదలో ఉన్న మనిషికి ప్రాణదానంతో సమానమని ఎన్ఎస్ఎస్ క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ సువర్ణలత పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో మంగళవారం బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. రెయిన్‌బో, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొని వ్యవసాయ కళాశాల విద్యార్థుల నుంచి రక్తం సేకరించారు. డాక్టర్ సువర్ణలత మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామంలో రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలువురు వ్యవసాయ విద్యార్థులు గ్రామంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యవంతుడే భాగ్యవంతుడు

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



ర్యాలీలో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్, కేశవతి దంపతులు

రేపల్లె రూరల్: సంపూర్ణ ఆరోగ్యవంతుడే మహద్భాగ్యవంతుడని, ప్రతి ఒక్కరూ ఆధునిక పోకడలకు పోకుండా ఆరోగ్య నియమాలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈవూరు సుబ్బారావు మెమోరియల్ హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి ఎస్టీ కాలనీలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అత్యాధునిక పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడికి గురై, తీసుకునే ఆహారంలో నాణ్యత లోపించటంతో 90 శాతం మంది ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. నిత్యం వ్యాయామం చేస్తూ, ఇంట్లో తయారు చేసిన నాణ్యత కలిగిన ఆహారం సుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంపూర్ణ ఆరోగ్యంను సూచించే సూక్తులతో ప్లకార్డులను ప్రదర్శిస్తూ విద్యార్థులతో గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని 170 మందికి డాక్టర్ అతిక్ వైద్య సేవలు అందించగా అవసరమైన వారికి ఉచితంగా మందులను డాక్టర్ గణేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరు కేశవతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సాగుపై అవగాహన హర్షణీయం

ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు



మొక్క నాటుతున్న ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు

బాపట్లటౌన్: హైడ్రోపోనిక్స్ (మట్టిలేని) సాంకేతిక సాగుపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం హర్షణీయమని ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు తెలిపారు. మండలంలోని స్టువార్టుపురం గ్రామంలో మంగళవారం బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్, ప్రొటెక్ట్ సంస్థ, అఖిలభారత వ్యవసాయ పరిశోధన గిరిజన ఉప ప్రణాళిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు హైడ్రోపోనిక్స్ సాగుపై అవగాహన కల్పించారు. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు మాట్లాడుతూ నీటి కొరత, భూమి తగ్గుదల వంటి సమస్యల మధ్య రైతులు ఆధునిక సాగు విధానాల వైపు దృష్టి సారిస్తున్నారన్నారు. వ్యవసాయ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన శిక్షణ తరగతులు ఎస్టీ రైతులకు, గృహిణులకు, నిరుద్యోగ యువతకు ఎంతో దోహదపడతాయన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్ మాట్లాడుతూ శిక్షణలో హైడ్రోపోనిక్స్ ప్రయోజనాలు, ఎక్సాటిక్ (విదేశీ) పంటల సాగు, వ్యవసాయ ఆధారిత స్వయం ఉపాధి అవకాశాలు, నర్సరీ మేనేజ్‌మెంట్‌పై గ్రామస్తులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించామన్నారు. హైడ్రోపోనిక్స్ అంటే మట్టికి బదులుగా నీటిలో పోషకాలు కలిపి మొక్కలను పెంచే ఆధునిక సాగు పద్ధతి. లెట్యూస్, బోక్ చోయ్, బెసిల్, రెడ్ బెల్ పెప్పర్ వంటి విదేశీ కూరగాయలు ఈ పద్ధతిలో పండించవచ్చన్నారు. వీటికి హోటల్స్, ఆర్గానిక్ మార్కెట్లలో అధిక డిమాండ్ ఉందన్నారు. రైతులకు హైడ్రోపోనిక్స్ ద్వారా కేవలం పంటలే కాదు, హైడ్రోపోనిక్ కిట్ల తయారీ, మార్కెట్ విక్రయం వంటి వ్యాపార అవకాశాల గురించి కూడా వివరించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృపావతి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.రవిబాబు, నర్సరీ మేనేజ్‌మెంట్ అధికారి ఎస్.చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



తెనాలి: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. స్థానిక బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లోని శ్రీసీతారామమందిరంలో 93వ నవమి వేడుకల్లో మంగళవారం భక్తుల సమక్షంలో శ్రీరమాసహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతాన్ని జరిపారు. ఈ వేడుకల్లో పట్టణానికి చెందిన నేతి ఆంజనేయశాస్త్రి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మార్కెట్ సెంటర్లోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం వసంతోత్సవం, పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజ అవరోహణ, గరుడముద్దల ప్రసాద వినియోగం చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త కోగంటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి జీవీ అమరనాథ్ పర్యవేక్షించారు.

పురమిత్ర యాప్‌ను వినియోగించుకోండి

మంగళగిరి టౌన్: ప్రజలు పంపిన సమస్యలను సకాలంలో అధికారులు పరిష్కరించేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషన్ అలీమ్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురమిత్ర మొబైల్ అప్లికేషన్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అయ్యి, ప్రజలు వారి సమస్యలను పొందుపర్చ వచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరపాలక సంస్థ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా సీతారాముల వసంతోత్సవం

మంగళగిరి టౌన్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాత మంగళగిరి సీతారామ కోవెలలో మంగళవారం సీతారాముల వసంతోత్సవం ఘనంగా జరిగింది. గ్రామోత్సవం సీతారాముల కోవెల నుంచి ప్రారంభమై మిద్దె సెంటర్ వరకు చేరుకుని.. తిరిగి కోవెలకు చేరుకుంది. ఆయా సెంటర్లలో భక్తులు సీతారాముల వారిని దర్శించుకుని, టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అర్చకులు నంబూరి వంశీకృష్ణమాచార్యులు బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవానికి పట్టణానికి చెందిన కొల్లి లక్ష్మి గిరిధరరావు, సుజాత దంపతులు కై ంకర్యపరులుగా వ్యవహరించారు. కార్యనిర్వహణాధికారి నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్తలు కృష్ణకుమారి, సీతానాగ మల్లేశ్వరి, కల్యాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోండి

జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం



మాట్లాడుతున్న సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: గర్భిణులు మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. సుల్తానాబాద్, గంగానమ్మ పేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా వైద్యుల పర్యవేక్షణలో ఉండాలన్నారు. ఎక్కువ శాతం ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాలలో జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. చిన్న పిల్లలకు తల్లిపాలు తాగించాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ ఉరబండి మహిత మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వలన వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అలాగే బిడ్డ జన్మించిన నాటి నుంచి సకాలంలో టీకాలు వేయించాలన్నారు. డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమార్ మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా పరీక్షలు చేయించుకోవడం వలన వారి ఆరోగ్య స్థితి బరువు, పెరుగుదల, పిండం ఆరోగ్య స్థితిగతులు తెలుస్తాయన్నారు. వైద్యులు సూచించిన జాగ్రత్తలను అందరూ పాటించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, మలేరియా అధికారులు వంగాల పున్నారెడ్డి, శివగణేష్, అందె బాల చంద్రమౌళి, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల శివప్రసాద్, వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

బాపట్లలో విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు

బాపట్లటౌన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ సెక్షన్ పరిధిలోని గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు, ఈఈ జి.భాస్కరరావు, విజిలెన్స్ అధికారి ఆర్.విజయ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు 40 బృందాలుగా ఏర్పడి 1,176 గృహ సర్వీసులు, 5 వాణిజ్య సర్వీసులు, 2 పరిశ్రమ సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 134 సర్వీసులు అనుమతించిన లోడు కంటే అదనంగా వాడినట్లు గుర్తించి వారికి రూ.6.7 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. ఎస్ఈ ఆంజనేయులు మాట్లాడుతూ ఎవరైనా విద్యుత్ చౌర్యం చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులు తమ అదనపు లోడును 50% రాయితీతో చెల్లించవచ్చన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు.

రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

అమర్తలూరు(వేమూరు): రెవిన్యూ సిబ్బంది అన్ని పనుల్లో అప్రమత్తంగా ఉండాలని రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి అన్నారు. అమర్తలూరు తహసీల్దారు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో పని చేసే సిబ్బంది పెండింగ్‌లో రికార్డులు లేకుండా చూడాలని చెప్పారు. వేసవి కాలంలో మంచి నీటి సమస్య గ్రామాల్లో ఉంటుందని, అధికారులు చొరవ తీసుకొని గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని ఆమె అధికారులకు సూచించారు. తాగు నీటి సమస్య నా దృష్టికి వస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రబీ సీజనలో అపరాల కొనుగోలు నత్త నడకన నడుస్తోందని, వాటిపై అధికారులు దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు నెహ్రూ బాబు, డిప్యూటీ తహసీల్దారు శివయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీవో రామలక్ష్మి

కొనసాగుతున్న క్లాప్ ఆటోడ్రైవర్ల సమ్మె



మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె మంగళవారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రెండు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. బాలాజీ, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు డి.శివ, ఎం.రవి, యూనియన్ నాయకులు యోహాన్, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ తెనాలి 11వ అదనపు జిల్లా సివిల్ జడ్జి వారి కోర్టులో

జి.డబ్ల్యు.ఓ.పి.136/2025

విజ్ఞాపన్

మార్పూరి లక్ష్మి ...పిటిషనర్

ఎదిరి

మార్పూరి గోపి ...రెస్పాండెంట్

పై నెంబరు పిటిషన్ లో పిటిషనర్ వారి మైనర్ కుమారుడైన మణికంఠకి ఉన్నత చదువు అరుల నిమిత్తము పిటిషన్ షెడ్యూల్ దాఖలా ఆస్తి. గుంటూరు డి॥ తెనాలి ఆ.డి. చెబ్రోలు మండలం శేకూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన శేకూరు గ్రామ డి.నెం. 254/1లో య.0.38 1/2 సెంట్లు మరియు గ్రామ డి.నెం. 254/1లో య.0.40 సెంట్లు చెరి య.0.78 1/2 సెంట్లు కలిగి ఉన్న ఆస్తిని అమ్ముటకు శ్రీ కోర్టు వారి పర్మిషన్ కొరకు సదరు పిటిషన్ దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీరు మరియు యావన్మందికి తెలియజేయ గలందులకు నోటీసు ఆర్డర్ వేసి ది. 28-04-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10.30 నిమిషాలకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల సదరు పిటిషన్ ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయుచున్నాము.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా తేది : 28-04-2025

ప్రదేశం: తెనాలి,

తేది: 08-04-2025

కంభంపాటి వెంకటేశ్వరరావు
పిటిషనర్ తరపు న్యాయవాది
తెనాలి. సెల్ : 9849414350